సూర్య
18వ వసంతంలోకి..
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
బుధవారం 19 మార్చి 2025 | పేజీలు 8



**రంజాన్ వేళలు**
ఇఫ్తార్
సా. 6:23 (బుధవారం)
సెహరీ
ఉ. 4:56 (గురువారం)

### ఔట్ ఫాల్ స్లూయిజులను
# పునర్ నిర్మించాలి



- అసెంబ్లీలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- రూ.36.8 కోట్లతో ఎస్టిమేషన్స్ వేశాం
- నాబార్డు నిధులు గానీ, జనరల్ ఫైనాన్స్ బడ్జెట్ నిధులతో గానీ ఔట్ ఫాల్ స్లూయిజులను నిర్మిస్తాం
- జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

2




### ఆర్టీఏ కార్యాలయంలో..
# బ్రోకర్లదే హవా



## ప్రతి వాహనానికి సపరేటు

- ఎల్ఎల్ఆర్ కావాలంటే చలానా 450.. బ్రోకర్‌తో 2000
- బ్రోకర్లతో కుమ్మక్కైన అధికారులు
- అధికారుల తీరుపై పెదవి విరుస్తున్న వాహనదారులు

**విజయవాడ బ్యూరో, మార్చి 18, మేజర్ న్యూస్ :** ఆర్టీఏ కార్యాలయంలో ప్రతి పనికి సపరేటుగా ముడుపులు చెల్లించాల్సిందేనట.. ముడుపులు ఇస్తే ఎంతటి పని అయినా ఆఘమేఘాల మీద నడిపిస్తారట... అదే ముడుపులు ఇవ్వకుంటే మాత్రం మన చెప్పులు అరిగిపోవడం ఖాయమనే ప్రచారం జరుగుతుంది. తాజాగా ఎల్ఎల్ఆర్‌కి దరఖాస్తు చేసుకొని నిజాయితీగా పరీక్ష రాస్తే ఫెయిల్ అవ్వడం తర్వాత బ్రోకర్ ద్వారా వెళితే వంద శాతం పాస్ గ్యారెంటీనట....

2లో

### నాటుసారా రహిత జిల్లా లక్ష్యంగా
# కొత్త నవోదయం

- సమష్టి భాగస్వామ్యంతో నాటుసారాను సమాజం నుంచి దూరం చేద్దాం..
- రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో విస్తృత అవగాహన కార్యక్రమాలు
- నవోదయం 2.0 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్టీఆర్ జిల్లా/తిరువూరు, మార్చి 18, మేజర్ న్యూస్ :** గ్రామాన్ని, మండలాన్ని, జిల్లాను తద్వారా రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా మార్చేందుకు, సమష్టి భాగస్వామ్యంతో నాటుసారాను సమాజం నుంచి దూరం చేసే లక్ష్యంతో నవోదయం 2.0

మిగతా 7లో...



# క్రీడలకు పునర్ వైభవం

- ప్రజాప్రతినిధులకు క్రీడలు ఆటవిడుపు
- ప్రజాప్రతినిధుల ఆటలతో కోలాహలంగా ఇందిరా గాంధీ స్టేడియం
- రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఆటవిడుపు కల్పించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రారంభించిందని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలను విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం మంత్రులు, ఉపసభాపతి కే. రఘురామ కృష్ణం రాజుతో కలసి ప్రారంభించిన అనంతరం రాష్ట్ర శాసనసభాపతి

2



(మొదటిపేజీ తరువాయి)

## ఆర్టీఏ కార్యాలయంలో బ్రోకర్లదే హవా




ఇదీ విజయవాడ ఆర్టీఏ కార్యాలయంలో ఒక్కొక్కటిగా బయటకొస్తున్న అవినీతి తంతు...

సాధారణంగా 18 ఏళ్ల లోపు మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే శిక్షార్హులు. అలాగని 18 ఏళ్లు దాటాక లైసెన్స్ కోసం ఆర్టీఏ కార్యాలయం గుమ్మం ఎక్కితే దోపిడీ అంతా ఇంతా కాదనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు వాహనానికి పేరు మార్చాలన్న ఏ పని కావాలన్న కుర్చీ కింద చేతులు తడపకుండా మాత్రం ఏ పనీ జరగదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఎల్ఎల్ఆర్ అప్లై చేసుకున్న టెస్ట్‌లో ఫెయిల్ అవుతుం డడం బ్రోకర్ ద్వారా వెళితే పాస్ అవుతుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. మరోవైపు బ్రోకర్ ద్వారా ఎల్ఎల్ఆర్ కోసం వెళితే 2 వేలు, అదే నేరుగా వెళితే చలానా ఖర్చు 450 రూపాయలు. ఉదాహరణకు ఎల్ ఎల్ ఆర్ కోసం వ్యక్తి ఆన్ లైన్ స్లాట్ బుక్ చేసుకున్నాడు. ఎవరి ప్రమేయం లేకుండానే 450 రూపాయలు చలానా కట్టి ఆ డేట్ కి వెళ్లి ప్రతి ప్రశ్నకు సమాధానంగా టిక్ పెట్టాడు. కాని అతను ఫెయిల్ అయ్యాడు. కాని బ్రోకర్ ద్వారా వెళ్లగానే 450 రూపాయలతో ఆన్ లైన్ స్లాట్ బుక్ చేసుకొని సిస్టమ్ ముందు కూర్చున్నాడు. అటు ఇటు చూడగానే ఒక వ్యక్తి వచ్చి చకా చకా అన్ని ఆన్సర్లు పెట్టేశాడు సదరు వ్యక్తి ఎల్ఎల్ఆర్ దక్కించేసుకున్నాడు. ఇందుకు గాను ఆర్టీఏ కార్యాలయంలో 900 ఖర్చు చేశాడు. ఇదంతా నడిపిన బ్రోకర్ కు 650 రూపాయలు ఒక్కో ఎల్ఎల్ఆర్‌కు మిగులుతుంటాయని గుసగుసలు వినబడుతున్నాయి. అంటే రోజుకు పదుల సంఖ్యలో ఎల్ఎల్ ఆర్ కోసం ఆర్టీఏ కార్యాలయంకు దరఖాస్తులు వస్తున్నాయి. దీంతో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారుల తీరుపై తాజాగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రోకర్ల ద్వారా వస్తేనే పట్టించుకుంటున్నారని సామా న్యులకు అయితే చుక్కలు చూపెడుతున్నారని మండిపడుతున్నారు. మరోవై పు లోపల అధికారులపై కూడా అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీఏ కార్యాలయంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్న ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ ఆర్టీఏ కార్యాలయం వద్ద బ్రోకర్ల దోపిడీని నిర్మూలించి సామాన్యులకు పెద్ద పీట వేయాలని డిమాండ్ చేస్తున్నారు వాహనదారులు. మరోవైపు ఎల్ ఎల్ ఆర్ పై జరుగుతున్న పరీక్ష తీరుపై మరింత నిఘా పెంచితే అసలు వాస్తవాలు బయటకొస్తున్నాయనే డిమాండ్ వినిపిస్తుంది. చూడాలి అధికారులు ఏ మేరకు యాక్షన్ తీసుకుంటారోనని...

### మంత్రి నారా లోకేష్ మల్లవల్లి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్




**గన్నవరం (మల్లవల్లి), మార్చి 18, మేజర్ న్యూస్ :** ఈ రోజు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ బాపులపాడు మండలం, మల్లవల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అశోక్ లే ల్యాండ్ ప్లాంట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో అశోక్ లే ల్యాండ్ ప్లాంట్ హెడ్ శ్రీధరన్ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ కు వివరించారు. కార్యక్రమం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతుందని, మంత్రి తొలుత మొక్కను నాటి ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. ప్లాంట్ లో నూతన బస్సును జండా ఊపి ప్రారంభిస్తారని, ఈ క్రమంలో మంత్రికి వాహనం తయారీలోని వివిధ దశలను చూపించి వివరించడం జరుగుతుందన్నారు. కంపెనీ చరిత్రను తెలియజేస్తూ ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకిస్తారని, పిమ్మట ప్లాంట్ లోపల ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారని వివరించారు. సౌండ్ సిస్టం, ఇంటర్నెట్ కనెక్షన్, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండాలని, వేదికపై ప్రోటోకాల్ సీటింగ్, యాంకరింగ్ పట్ల జాగ్రత్త వహించాలని కలెక్టర్ నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. మంత్రితో పాటు ఇతర ప్రముఖులకు గ్రీన్ రూమ్, స్నాక్స్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు గుడివాడ డివిజన్ ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, తహసిల్దార్ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

# ఔట్ ఫాల్ స్లూయిజులను పునర్ నిర్మించాలి



**అసెంబ్లీలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

**రూ.36.8 కోట్లతో ఎస్టిమేషన్స్ వేశాం**

**నాబార్డు నిధులు గానీ, జనరల్ ఫైనాన్స్ బడ్జెట్ నిధులతో గానీ**

**ఔట్ ఫాల్ స్లూయిజులను నిర్మిస్తాం**

**జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న ఔట్ ఫాల్ స్లూయిజులను అభివృద్ధి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాలలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో పుట్టే కృష్ణానది అవనిగడ్డ నియోజకవర్గంలో సాగర సంగమం అవుతోందన్నారు. కృష్ణానది రెండు పాయలుగా చీలి సముద్రంలో కలిసే చివరి ప్రాంతంగా దివిసీమ ఉందని తెలిపారు. చుట్టూ నది ఒక వైపు సముద్రం మధ్యలో ఉన్న ద్వీపమే అవనిగడ్డ నియోజకవర్గం అని చెప్పారు. ఈ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని పరిశీలించిన బ్రిటిష్ పాలకులు 1935-37 లోనే కృష్ణానదికి కుడి ఎడమ కరకట్టలు నిర్మించారని తెలిపారు. సముద్రానికి కూడా కట్ట నిర్మించవలసిన ఆవశ్యకతను తన తండ్రి మండలి వెంకటకృష్ణారావు నాటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా నాటి ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి స్వయంగా దివిసీమకు వచ్చి ఇక్కడి సమస్యను పరిశీలించారని తెలిపారు. సముద్రపు కరకట్ట నిర్మిస్తే పదివేల ఎకరాలు సాగులోకి తేవడంతో పాటు తీరానికి రక్షణ ఏర్పడుతుందని గుర్తించి 1960లో కేంద్రం సహకారంతో సముద్రపు కరకట్ట నిర్మాణం చేసినట్టు తెలిపారు. అనంతరం వ్యవసాయ భూముల నుంచి మురుగునీరు సముద్రంలోకి పోయేందుకు, సముద్రపు ఓటు నీరు పొలాల్లోకి చొచ్చుకు రాకుండా ఉండేందుకు అనువైన ఔట్ ఫాల్ స్లూయిజులను నిర్మించినట్లు తెలిపారు.

అయితే గత వైసీపీ ప్రభుత్వం ఔట్ ఫాల్ స్లూయిజులకు కనీసం మరమ్మత్తులు కూడా చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో అవి పూర్తిగా సమస్యాత్మకంగా మారాయని తెలిపారు. ఫలితంగా తీరప్రాంత రైతాంగం అష్ట కష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. తీవ్రమైన ముంపు సమస్యతో పాటు ఐదు వేల ఎకరాల పంట భూమి సాగుకు దూరమైందన్నారు. ఈ స్థితిలో ఔట్ ఫాల్ స్లూయిజులను బాగు చేయించాలని టీడీపీ నాయకత్వంలో తాను సముద్రపు కరకట్టపై పాదయాత్ర చేసి ఔట్ ఫాల్ స్లూయిజులను బాగు చేయించాలని కోరినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యపై తాను తహశీల్దారుకు అర్జీ ఇచ్చే ప్రయత్నం చేస్తే 30 యాక్ట్ ప్రయోగించి తనను గృహ నిర్బంధం చేశారన్నారు. సమస్య తీవ్రతను వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు తాను రెండు రోజులు ఆమరణ దీక్ష చేస్తే పోలీసులతో అరెస్టు చేయించారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో 40 బస్తాలు ధాన్యం పండిన భూమి ఔట్ ఫాల్ స్లూయిజుల సమస్య కారణంగా సాగుకు నోచుకోవట్లేదన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఔట్ ఫాల్ స్లూయిజులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసి, ఈ వేసవిలోనే పనులు చేపట్టి తీర ప్రాంత రైతాంగానికి, దివిసీమ రైతాంగానికి భరోసా కల్పించాలని కోరారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రసంగంపై అసెంబ్లీలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలోని రత్నకోడు మేజర్ డ్రైన్, న్యూ ఇరాలి మీడియం డ్రెయిన్, ఉప్పు కాలువ మీడియం డ్రెయిన్, మంగలేరు మీడియం డ్రెయిన్, మేకల కాలువ మీడియం డ్రెయిన్, పిట్టల్లంక మైనర్ డ్రెయిన్, కోడూరు మైనర్ డ్రెయిన్ల ఔట్ ఫాల్ స్లూయిజులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పంట పొలాల నుంచి మురుగునీరు, భారీ వర్షాల ముంపు నీరు సముద్రంలోకి పోయేందుకు తెరుచుకుని, సముద్రపు పోటు నీరు పొలాల్లోకి చొరబడకుండా మూసుకునేలా ఆటోమెటిక్ ఫాలింగ్ షట్టర్లతో పని చేసే ఈ ఔట్ ఫాల్ స్లూయిజులను 1979లో నిర్మించారని తెలిపారు. సముద్రపు అలల ఉధృతికి, ఉప్పునీటికి తుప్పుపట్టే షట్టర్లను ఎప్పటికప్పుడు నిర్వహించాల్సి ఉండగా, గత వైసీపీ పాలకులు కనీసం గ్రీజు కూడా పెట్టకుండా మెయింటినెన్స్ చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఫలితంగా అవి మరమ్మతులకు కూడా పనికి రాకుండా పోయాయని, నూతన ఔట్ ఫాల్ స్లూయిజులను నిర్మించవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందుకోసం ఇప్పటికే నాబార్డు నిధులు రూ. 36.8 కోట్లతో నూతన ఔట్ ఫాల్ స్లూయిజులను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని, లేకపోతే జనరల్ ఫైనాన్స్ బడ్జెట్ నుంచి నిధులు తీసుకొని పునర్ నిర్మాణం చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు.

# క్రీడలకు పునర్ వైభవం



(మొదటిపేజీ తరువాయి)

అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రోజూ బిజీగా ఫోన్ మాట్లాడుకుంటారని, కనీసం ఈ 3 రోజులైనా మొబైల్ ఫోన్ ను పక్కన పెట్టి క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు క్రీడలు కొత్త సంప్రదాయం కాదని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ హ యాంలోనే ఎమ్మెల్యేల క్రీడలకు శ్రీకారం చుట్టామన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావుకు క్రీడలన్నా, సాంస్కృతిక కార్యక్రమాలన్నా చాలా మక్కువన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజాప్రతినిధుల క్రీడలు మరుగున పడిపోయాయన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడలతో కోలాహలంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మారిందన్నారు. మూడు రోజులపాటు ప్రజాప్రతినిధులు విధిగా క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో క్రీడలకు పూర్వవైభవం చేకూరేలా అందరూ సహకరించాలన్నారు. అసెంబ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించి, 2 గంటల తరువాత క్రీడల్లో పాల్గొంటామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు.

రాష్ట్ర అసెంబ్లీ ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల్లో కూడా ఎంతో మంది నేషనల్ ప్లేయర్స్ ఉన్నారన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో కృషి చేయాలన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సెషన్‌లోనే క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడా ప్రోత్సాహకాలు పెంచి క్రీడలకు అత్యధిక ప్రోత్సాహం అందిస్తుందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు సీఎం అయిన తరు వాత రాష్ట్రంలో క్రీడాకారులకు మంచి అవకాశాలు వచ్చాయన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ప్రతిష్ఠాత్మకంగా క్రీడల నిర్వహణను చేపట్టడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడల నిర్వహణతో పాత సాంప్రదాయానికి నాంది పలకటం జరిగిందన్నారు. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడల కమిటీ సహకా రంతో పటిష్ఠ ఏర్పాట్లు చేశామన్నారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలను శాప్ ఆధ్వర్యంలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.





తొలుత మంత్రులు, ఛీఫ్ విప్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు లు క్రీడా జ్యోతిని వెలిగించి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించిన క్రీడల నిర్వహణ కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు..

ఈ రోజు టగ్ ఆఫ్ వార్ పోటీలో పాల్గొని తాడు లాగిన మహిళా మంత్రులు.. మంత్రి సంధ్యారాణి వెర్సెస్ మంత్రి అనిత టీమ్.. టగ్ ఆఫ్ వార్ లో సంధ్యారాణి టీమ్ గెలిచింది. అదేవిధంగా టగ్ ఆఫ్ వార్ లో మహిళా ప్రజాప్రతినిధులు వెర్సెస్ పురుష ప్రజాప్రతినిధుల పోటీలో మహిళలే గెలిచారు.. అదేవిధంగా ప్రజాప్రతినిధుల్లో సీఎం, స్పీకర్ టీములుగా క్రికెట్‌లో పోటీపడ్డారు.. వాలీబాల్, షటిల్ తదితర పోటీలు కూడా నిర్వహించారు...

### శాసనసభ్యుల క్రీడా పోటీలలో కుమార్ రాజా



**పామర్రు మార్చి 18 మేజర్ న్యూస్ :** విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో జరిగిన క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో పామర్రు శాసనసభ్యులు కుమార్ రాజా పాల్గొన్నారు. శాసనసభ్యుల క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం నిర్వహించిన ఈ పోటీలలో కుమార్ రాజా పాల్గొన్నారు. పోటీలలో మంత్రులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతో కలిసి ఆయన ఉత్సాహంగా పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచారు.

# ఘనంగా రామాలయం మొదటి వార్షికోత్సవం వేడుకలు







**కంచికచర్ల మార్చి 18 మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానం రామాలయం పునః ప్రతిష్ట మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా హోమాలు ప్రత్యేక పూజలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం నుండి ప్రత్యేక పూజలుహోమాలు జరుగుతున్నాయి. మంగళవారం ఆలయ, శిఖర సంప్రోక్షణ కార్యక్రమాలను వేదపండితులచే ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకొని రామాలయంలో విశ్వక్సేన పూజ, కర్మణి పుణ్యాహవాచనం, స్వామివార్లకు స్నపన తిరువంజనము, అలంకరణ, పంచసూక్త సహిత పరమాత్మక హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకను కన్నుల పండుగగా జరిపారు. రామాలయ వార్షికోత్సవ వేడుకలు, స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు కంచికచర్ల పరిసర గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల రాకకు తగ్గట్లుగా రామాలయ అభివృద్ధి కమిటి అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయ పూజారి భాష్యం వెంకట రామ శేష భట్టర్ తారంబాబు ఆధ్వర్యంలో వేద పండితులు హోమాపూజాది, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రామాలయంలో పెద్ద ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. భక్తులు వేలాదిగా పూజలు, హోమ పూర్ణాహుతి కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# జడ జానన్న ఛారిటబుల్ ట్రస్టుచే పేదలకు ఆర్థిక సహాయం



**గుడివాడ, మేజర్ న్యూస్ :** అపదలో ఉన్న వారిని అదుకోవడంలో జడ జానన్న ముందు ఉంటారాని, గత 2రోజులు క్రితం యాక్సిడెంట్లో మృతి చెందిన పుసుపులేటి నిరిక్షణ్ కుట్టుంబ సభ్యులకు, క్యాన్సర్ బారిని పడి రక్తం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు జడ జన్నన్న ఛారిట్రబుల్ ట్రస్టు దారా రూ. 13వేలు అందించడం గొప్ప విషయమాని ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకార్ అన్నారు. మంగళవారం స్థానిక గుడెమెన్ పేటలోని జడా జనన్న చారిట్రబుల్ అధ్వర్యంలో చైర్మన్ అడా జాన్రాజు(జనన్న) మృతి చెందిన నిరిక్షణ్ కుటుంబ సభ్యులకు రూ. 10వేలు, క్యాన్సర్ వ్యాదిని పడి చికిత్స పొందుతున్న వ్యక్తికి రక్తం నిమిత్తం రూ. 3200 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కంచర్ల సుధాకార్ మాట్లాడుతూ జడా జనన్న అయన ట్రస్టు ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కరోనా సమయ్యలో ఎన్నో కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఆయన సేస్తున్న సేవాను ఆదర్శంగా తీసుకుని దాతలు ముందుకు రావలన్నారు. ఈ కార్యక్రమంలో పలువరు దళిత నాయకులు కొడాలి బాలు, కాటూరి శ్రీనివాస్, కలపాల ఏసురాజు, నిరంజన్, అదంకి ఏబేల్, దిలిప్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# తీవ్ర ఉద్భృతంగా సాగిన శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ళ

## పోలీసుల తీరుపై భక్తులు అసహనం





**పెనుగంచిప్రోలు మార్చి 18 మేజర్ న్యూస్ :** గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్లు తీవ్రమైన రాజకీయ జోక్యంతోనే కొనసాగాయి అని భక్తుల ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం జరిగే తిరునాళ్లు రాజకీయ ప్రభలతో, రాజకీయ పాటలతో జండాలతో పోటీలు పడి మరి లక్షలాది రూపాయల ఖర్చు చేసుకొని అమ్మవారికి నీరాజనాలు పలుకుతుంటారు. అయితే ఈ సంవత్సరం గతానికి భిన్నంగా వందలాదిమంది పోలీసులను మోహరించి ఒక తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రభలను, ఊరేగింపులను పోలీసులు దగ్గర ఉండే మరీ స్వాగత సన్నాహ సత్కారాలు చేశారు. ఇతర పార్టీలకు చెందిన ప్రభలను, వాహనాలను గంటలపాటు పెనుగంచిప్రోలు రాకుండా అడుగడుగునా బారి కేడ్లు పెట్టి అడ్డుకోవడం జరిగింది. దీనివల్ల దీనివల్ల భక్తి భావంతో అమ్మవారిని కొలుచుకోవలెనే ఇతర పార్టీల భక్తులకు తీవ్రమైనటువంటి నిరాశ కలిగింది. పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన కొంతమంది పేద వర్గానికి చెందిన యువకులు తిరుపతమ్మ అమ్మవారిని కొలుచుకునేందుకు వైయస్సార్ పార్టీకి సంబంధించిన, అలంకరణలతో లక్షల ఐదు రూపాయలు ఖర్చు చేసుకొని తంబరేణి గార్డెన్స్ నుండి రాత్రి సమయంలో ఊరేగింపు నిర్వహించారు. ఆ ఊరేగింపు పోలీస్ స్టేషన్ వద్దకు సమీపించాక, తెలుగుదేశం పార్టీ వారి ఊరేగింపు మాత్రమే అనుమతిస్తూ, వైసీపీకి చెందినటువంటి ప్రభలను దాదాపు మూడు గంటలసేపు ఆపివేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలు టిడిపి, జనసేన, వైసీపీ ప్రభలతో నిండిపోయింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వారు వైసిపి పార్టీ వారిని దూషిస్తూ వారి డీజే లలో అసభ్యకరమైనటువంటి డైలాగుల్ని వినిపించారు. దీనికి ఆవేశం చెందినవైసీపీ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.. పోలీసు వర్గాల వారు కూడా దీనిపై ఎటువంటి స్పందన లేకుండా చూస్తూ ఊరుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం వైసిపి వర్గాల మధ్య ఘర్షణ జరిగి వాటర్ బాటిల్స్, చెప్పులు లాంటి విస్తరికోవడం జరిగింది. పోలీసులు ఈ ఘర్షణలను నివారించడంలో పూర్తి వైఫల్యం చెందారు. ఒక్క మాటలో చెప్పాలంటే పోలీస్ స్టేషన్ వద్ద మూడు పార్టీలకు చెందినటువంటి వాహనాలను,, గంటల పాటు అక్కడ నిలిపివేసి పరోక్షంగా ఘర్షణలకు పోలీస్ వారే కారణం అయ్యారు. ప్రతి సంవత్సరం సుమారు రాత్రి 11 గంటలకల్లా పూర్తయ్యే ఈ ప్రబల ఉత్సవం ఈ సంవత్సరం పోలీసుల అచ్చోత్సాహం వలన తెల్లవారుజామున నాలుగు గంటల వరకు భక్తులు ప్రజలు తీవ్ర ఇబ్బందుల గురి కావలసి వచ్చింది. భక్తులలో విసిగిపోయిన అసహనం కూడా ఈ ఘర్షణలకు కారణం అయ్యింది. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. కానీ పోలీసు వారు టిడిపి పార్టీ వారిని వదిలిపెట్టి కేవలం వైసీపీ వారే తమపై దాడి చేశారని కట్టు కథ అల్లి కేసులు పెట్టి, అమాయకులైన వైయస్సార్ పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యకర్తలను అకారణంగా ఇళ్లపై బడి నిర్బంధించి వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు. కనీసం వారి కుటుంబ సభ్యులను సైతం వారిని కలిసేందుకు అనుమతించడం లేదు. రాళ్లు విసిరిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను నాయకులను, పూర్తిగా వెనకేసుకుని వచ్చి, పోలీసులు వారికి అండగా ఉంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతమ్మ అమ్మవారి తిరుణాల ఉత్సవాలలో సైతం రాజకీయ లబ్ధికి తెలుగుదేశం పార్టీ పూర్తిగా ఉపయోగించుకోవడంలో సఫలీకృతం అయింది. పోలీసు ఉన్నత అధికారులు సైతం తెలుగుదేశం పార్టీ విధానాలకు అనుకూలంగానే తమ పాత్ర నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక ప్రజాస్వామ్యం ఎక్కడుంది. ప్రాథమిక హక్కులు ఏమయ్యాయి. అమ్మవారి ఉత్సవాలను సైతం రాజకీయపరం చేస్తే ఇక అమ్మవారిని మొక్కుకోవాలంటే ఎవరు ముందుకు వస్తారు. పోలీసు వర్గాలు టిడిపి, వైసిపి ఘర్షణను, పోలీసు- వైసిపి ఘర్షణగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసం. పెనుగంచిప్రోలు లో జరిగిన ఈ పరిణామాలు మితిమీరిన రాజకీయ దౌర్యంతో ముమ్మాటికీ పోలీసు వారి వైఫల్యమే అని చెప్పక తప్పదు. కనుక ఉన్నత అధికారులు ఈ విషయం పై సమగ్ర విచారణ జరపడం తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



## రాంబాబు మాస్టారుకి సెలవు.. కన్నీటితో వీడ్కోలు ..

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన మచిలీపట్నం లేడీ ఎంప్తుల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు రేపల్లె రాంబాబు(55) అంతిమయాత్ర మంగళవారం విద్యార్థులు అశ్రునైనాలు మధ్య జరిగింది. ప్రభుత్వ కళాశాల అధ్యాపకులుగా షార్ట్ హ్యాండ్ మాస్టారుగా స్థానిక సిటీ కేబుల్ లో న్యూస్ రిపోర్టర్ గా పనిచేసిన రేపల్లె రాంబాబు అనారోగ్యంతో సోమవారం సాయంత్రం గుంటూరు లో మరణించారు. రాంబాబు మాస్టర్ సతీమణి సాయిలీల మచిలీపట్నం స్థానికఇంజనీరింగ్ కాలేజీల్లో ఇంగ్లీషు లెక్చరర్ గా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. మంగళవారం మచిలీపట్నం చెందిన పలు విద్యాసంస్థల అధినేతలు విద్యార్థులు పుర ప్రముఖులు రాంబాబు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లేడీ ఎంప్తుల్ కళాశాల మేనేజ్మెంట్ కమిటీ మాజీ సభ్యులు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ షార్ట్ హ్యాండ్ మాస్టర్ గా ఎంతో అనుభవం కలిగిన రాంబాబు వద్ద శిక్షణ పొందిన వందలాది విద్యార్థులు ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడ్డారని అన్నారు. అధ్యాపక వృత్తికి వన్నెతెచ్చిన రాంబాబు తన గాంభీర కంఠంతో ఎందరో రాజకీయ నాయకుల మన్ననాలు పొందారని బాలాజీ అన్నారు. లేడిఎంప్తుల్ కళాశాల ప్రిన్సిపాల్ వి. సుందర్ లక్ష్మీ మాట్లాడుతూ కళాశాలలో జరిగే జరిగిన ప్రతి కార్యక్రమంలో రాంబాబు మాస్టారు పాత్ర ఎంతో కీలకంగా ఉండేదని అన్నారు. మచిలీపట్నం నోబుల్ కాలేజీ రోడ్డు దిమ్మల సెంటర్ వద్ద ప్రారంభమైన అంతిమయాత్ర జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, లేడీ ఎంప్తుల్ కళాశాల, రేవతి సెంటర్ మీదుగా హిందూ స్మశాన వాటికకు వెళ్ళింది. అనేకమంది విద్యార్థులు రాంబాబు ఆర్థిక దేహం వద్ద కంటనీరు పెట్టి నివాళులర్పించారు.

## పెన్షనర్ల ల సమస్యలు పరిష్కరించండి

### రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహన్ రావు



**గన్నవరం, మార్చి 18, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గన్నవరం తాలూకా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహన్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ పిలుపుమేరకు గన్నవరం ఎమ్మార్వో శివ ప్రసాద్కు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటుపల్లి మోహన్ రావు, కార్యదర్శి దాదా వల్లి సాహెబ్, నందం బసవేశ్వరరావు, కోటేశ్వరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



**గన్నవరం, మార్చి 18, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం చిన్న ఆవుటపల్లి జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనదారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని అంబులెన్స్ లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆత్కూరు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

### సభ్యత్వం తీసుకున్న కోటి మందికి రూ.5లక్షల ప్రమాద బీమా

### ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ, మార్చి 18, మేజర్ న్యూస్:** పట్టణం లోని కాకాని నగర్‌లో ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం నాడు వారి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను కూటమి నేతలతో కలిసి పంపిణీ చేయడం జరిగినది ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశానికి ఉంది. కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ఎప్పుడూ పెద్దపీట వేస్తుంది. కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయ కర్తగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టాక వారికి విద్య, ఉద్యోగ, వైద్య సహాయం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యకర్తలు ఏదైనా ప్రమాదంలో మరణించినప్పుడు ఆదుకోవడానికి సభ్యత్వ నమోదు ఉపయుక్తంగా ఉంటుంది. కుటుంబ సాధికారక సారధులను నియమించుకునే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కోటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ సందర్శించిన చైర్మన్ కృష్ణకుమారి



**నందిగామ, మేజర్ న్యూస్:** పట్టణంలోని స్థానిక రైతు బజార్‌లోని అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారని, అన్న క్యాంటీన్లను పునః ప్రారం భించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొని, తదనంతరం వారితో కలిసి భోజనం చేసి, స్థానికుల్ని ఎలా ఉందని ప్రశ్నించగా చాలా బాగుందని దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్న అన్న క్యాంటీన్లకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఏచూరి రామకృష్ణ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు కొప్పాకుల శ్రీనివాసరావు ఏవన్ పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు తక్షణ అనుమతులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందుకు సంబంధించిన అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో తక్షణమే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో అజెండా అంశాలు, పెండింగ్ దరఖాస్తుల పురోగతి, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికవాడలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సింగిల్ విండో పద్ధతిపై పరిశ్రమల ఏర్పాటుకు తక్షణ అనుమతులు, రాయితీలు కల్పించాలన్నారు. వచ్చే సమావేశం నాటికి పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని సూచించారు.పరిశ్రమల ఏర్పాట్లలో మౌలిక వసతులకు సంబంధించి ఆయా డిపార్ట్మెంట్ల వద్దకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, జెడ్పి సీఈవో కన్నమనాయుడు, డిఆర్‌డిఏ పిడి వై హరిహరనాథ్, ఎల్‌డి ఎం రవీంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, అగ్నిమాపక, మత్స్య తదితర శాఖల అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితాకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలి





**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీతో బాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం ఉదయం నగరంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వారి చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై సమావేశం నిర్వహించారు.జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే కాకుండా అంతకు ముందుగా కూడా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు తీసుకొని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఆమేరకు ఇకపై ప్రతి నెల గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకొని ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుగ్గా ఉండి వారి దృష్టికి వచ్చిన ఎన్నికల అంశాలు ఏమైనా ఉంటే వాటిని సమావేశంలో తెలియజేయాలన్నారు.

ఎన్నికల సమయంలో హడావుడి చేయకుండా ముందుగానే పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, మరుగుదొడ్లు తదితర కనీస సదుపాయాలు ఎవరికి ఇబ్బంది లేకుండా ముందుగానే కల్పించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో అవసరమైన మరమతులు చేపట్టి కావలసిన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిఆర్ఓ చంద్రశేఖర రావు, సిపిఐఎం, బిజెపి, బిఎస్పి,తెలుగుదేశం, వైఎస్ఆర్సిపి, జనసేన పార్టీల ప్రతినిధులు కొడాలి శర్మ, పి వి గజేంద్ర రావు, ఎస్ బాలాజీ, బి ఎం బి దాస్-దిలీప్ కుమార్, షేక్ సిలార్ దాదా, వెంకట్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు శ్యామ్ నారాయణ పాల్గొన్నారు.

## 2.20 లక్షలతో రెండు సిమెంటురోడ్ల నిర్మాణం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** పంచాయతీ నిధులు 2.20 లక్షలతో రెండు సిమెంటు రోడ్ల నిర్మించుటకు పనులు మంగళవారం ప్రారంభించారు. గుడ్లవల్లేరు ప్రధాన సెంటరులోని వైఎస్సార్ బ్రిడ్జి దిగువ నుండి మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలకువెళ్ళే రోడ్డు టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వరకు లక్ష రూపాయలతో సిమెంటురోడ్డు, చంద్రన్న కాలనీలో లక్షా యిరవై వేలతో మరో సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఇ నాగేశ్వరరావు తెలిపారు. ఈక్రమంలో వైఎస్సార్ బ్రిడ్జి దిగువనున్న ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా వున్న మట్టిని జెసిబితో తొలగిస్తూ సిమెంటురోడ్డు నిర్మాణానికి పనులకు శ్రీకారం చుట్టామని, వ్యాపారస్తులకు, కార్యాలయాలకు వెళ్ళే ప్రజలకు, అధికారులకు యిబ్బందికరంగా లేకుండా త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేస్తామని ఏఇ నాగేశ్వరరావు తెలిపారు.

## శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కంచికచర్ల మార్చి 18 మేజర్ న్యూస్ :** స్థానిక మార్కెట్ యార్డ్ లో శనగ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా మార్క్ ఫైడ్ అధికారి కె నాగ మల్లిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ మార్క్ ఫైడ్, నా ఫైడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 5,650 రూపాయలు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుకూలంగా కొనుగోలు చేయటం జరుగుతుందని అన్నారు. కంచికచర్ల మండల పరిధిలోని శనగ మిషన్ కోత వల్ల మట్టి పెడ్డలు ఎక్కువగా ఉన్నాయని రైతులు అమ్ముకునేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. రైతు సేవా కేంద్రంలో శనగలు కొనుగోలు చేసిన 10 నుంచి 15 రోజుల లోపు రైతుల అకౌంట్లో నగదు జమ అవుతుందని తెలిపారు, బ్యాంక్ అకౌంట్ కి ఆధార్ లింక్ అయ్యి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ అసెంబ్లీ ఆవరణలో ఆకట్టుకున్న ఫొటో సెషన్



**పామర్రు మార్చి 18 మేజర్ న్యూస్ :** ఏపీ అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఫొటో సెషన్ నిర్వహించారు. మొదటి వరుసలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు పాల్గొన్నారు. సీనియారిటీ ప్రకారం ఎమ్మెల్యేలు 2, 3, 4 వరుసల్లో కూర్చున్నారు. అనంతరం ఎమ్మెల్సీల ఫొటో సెషన్ జరిగింది. ఈ ఫొటో సెషన్ లో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కూడా పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు పంచాయతీలో చెత్త సేకరణ పారిశుద్ధ్య పనులను సమగ్ర ప్రణాళికతో నిర్వహిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచే గ్రామం లోని దుకాణాలు, ఇళ్ళవద్ద నుండి పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్న చెత్త సేకరణ కార్యక్రమం తీరుతెన్నులను కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు పరిశీలిస్తు న్నారు. అదేవిధంగా గుడ్లవల్లేరు ప్రధాన వీధుల వెంబడి ఊడ్చిన చెత్తను సైతం ఎప్పటికప్పుడు తొలగిస్తూ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య నిర్వ హణ చేస్తున్నారు. అలాగే చెత్తను బయట పారవేస్తే కఠిన చర్యలు చేపడతా మని వ్యాపార దుకాణదారులకు హెచ్చరికలు సైతం చేస్తున్నారు. సేకరణ సిబ్బంది తడిపొడి చెత్తలను వేరుచేస్తూ సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తు న్నారు. ప్రత్యేకాధికారుల ఆకస్మిక తనిఖీలు : మండల ప్రత్యేకాధికారి, జిల్లా బిసి సంక్షేమ అధికారి రమేష్, గ్రామ ప్రత్యేకాధికారి ఎంపిడిఓ విజయసా రధిలు ఉదయ కాలమే ఆకస్మిక తనిఖీలతో గుడ్లవల్లేరు గ్రామంలోను, మండలంలోని వివిధ గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుద్ధ్య, సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేస్తూ పరుగులు పెట్టిస్తుండడం విశేషం.

## జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు



**గన్నవరం, మార్చి 18, మేజర్ న్యూస్ :** నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను మంగళవారం గన్నవరం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించినట్లు ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి. విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. పి.నరేష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వి.వి. కృష్ణ మోహన్ సంయుక్తంగా తెలియజేసారు. ఈ జాబ్ మేళాలో బజాజ్ క్యాపిటల్, ఫ్లిప్కార్ట్, శ్రీ రామసాయి ఆఫీస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. మొత్తంగా 28 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.వి. కృష్ణ మోహన్, ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి. విక్టర్ బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నియామకాధికారి తుర్లపాటి మధు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బి.ఎస్.ఆర్ సుజిత్, హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బుడమేరు సమగ్రాభివృద్ధికి పరిపూర్ణంగా నిధులు కేటాయించాలి

**గత ఏడాది వరద భీభత్సానికి దెబ్బతిన్న వాగులు, చెరువులు, ఎన్.ఎస్.పి కాల్వల అభివృద్ధికి కూడా నిధులు ఇవ్వాలి**

**ఆకస్మిక వరదల వల్ల మైలవరం నియోజకవర్గం పూర్తిగా దెబ్బతింది**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** బుడమేరు అభివృద్ధితో పాటు, గత ఏడాది ఆకస్మిక వరదల వల్ల మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా దెబ్బతిన్న వాగులు, చెరువులు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఏపీ అసెంబ్లీలో స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు మంగళవారం మాట్లాడుతూ గత ఏడాది సంభవించిన వరదల భీభత్సానికి మైలవరం నియోజకవర్గం పూర్తిగా దెబ్బతిందన్నారు. అప్పట్లో 35 సెంటిమీటర్ల వర్షపాతం కురిసిందన్నారు. దీని వల్ల కోతులవాగు, పులివాగు, ఒకసారిగా వరద బీభత్సంతో పొంగి పొర్లాయని పేర్కొన్నారు. ఈ వాగులు అన్ని బుడమేరులో కలుస్తాయన్నారు. వీటితో పాటు 50కి పైగా చెరువుల కట్టలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువలు, వాగులు, వంకలు కూడా చాలాచోట్ల గండ్లు పడి తెగిపోయాయని పేర్కొన్నారు. బుడమేరు అభివృద్ధికి ప్రభుత్వం రూ.39.05 కోట్లు కేటాయించినట్లు నేడు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. ఇందులో బుడమేరు హెడ్ రెగ్యులేటర్ మరమ్మతులకు రూ.1.08 కోట్లు, మిగిలిన పనులకు రూ.37.97 కోట్లు కేటాయించారన్నారు. బుడమేరుకు పడిన ప్రధాన గండికి ఇరువైపులా రక్షణ గోడ నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు.బుడమేరు 70 శాతంకు పైగా మైలవరం నియోజకవర్గంలో ఉందన్నారు. దీనికి అనుబంధంగా ఉన్న కోతుల వాగు, పులివాగులు కూడా ఇక్కడే ఉన్నాయన్నారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వచ్చిన ఆకస్మిక వరదల వల్ల గ్రామాలకు రక్షణగా ఏర్పాటు చేసిన కరకట్టలు, పొలాలకు రక్షణగా ఏర్పాటు చేసిన కట్టలు కూడా పూర్తిగా కొట్టుకుపోయాయన్నారు. ఈ వాగులు పొంగిన కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా 50కి పైగా చెరువులు పూర్తిగా తెగిపోయాయన్నారు. వాగులు, బుడమేరు కట్టల అభివృద్ధికి ప్రభుత్వం రూ.35 కోట్లకు పైగా అంచనాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇంకా వాగులు, చెరువులు, సాగర్ కాల్వల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించాలని అన్నారు. గతంలో అప్పటికప్పుడు యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా గండ్లు పూడ్చామని, దానికి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు.బుడమేరును, దానికి అనుబంధంగా ఉన్న కాల్వలను, వాగులను, చెరువులను శాశ్వతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇవన్నీ అభివృద్ధి చేయకుండా మళ్ళీ అకాల వర్షాలు వస్తే మళ్ళీ విజయవాడకు వరదనీటి ముంపు తప్పదని హెచ్చరించారు. గతంలో బుడమేరు వరద నీటి ముంపు ప్రభావాన్ని, దానివల్ల జరిగిన నష్టాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, జలవనరుల శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు ప్రత్యక్షంగా చూశారని పేర్కొన్నారు.గతంలో చేసిన తాత్కాలిక మరమ్మతులకు, ఇప్పుడు చేపట్టవలసిన పనులకు, బుడమేరుతో పాటు, దానికి అనుబంధంగా ఉన్న వాగులు, చెరువులు, ఎన్.ఎస్.పి కాల్వల సమగ్రాభివృద్ధికి పరిపూర్ణంగా నిధులు కేటాయించి, భవిష్యత్తులో ఎటువంటి విపత్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఏపీ అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.



## నాణ్యతా ప్రమాణాల మెరుగుదలకు బిఐఎస్ కృషి

పామర్రు మార్చి 18 మేజర్ న్యూస్ : ప్రభుత్వ శాఖలు, వాణిజ్య విభాగాలు, పరిశ్రమలలో నాణ్యత ప్రమాణాలు పాటించే దిశగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విస్తృత చర్యలు చేపట్టినట్లు ఆ సంస్థ రిసోర్స్ పర్సన్ జొన్నలగడ్డ రవికుమార్ తెలిపారు. విస్తృత పర్యటనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ అధికారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పామర్రు లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఈ కార్యక్రమంలో భాగంగా ఘంటసాల, మొవ్వ మండలాల్లో స్థానిక తహసిల్దార్ కార్యాలయాల్లో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాణ్యత ప్రమాణాలు మెరుగుదలకు తీసుకోవాల్సిన అంశాలను విశదీకరించినట్లు చెప్పారు. అనంతరం ఆయా అధికారులు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమం చేపడతారని, ఆ సమయంలో తమ శాఖ నుండి ప్రతినిధులు కూడా హాజరై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా తహసిల్దార్ లకు నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన డైరీ, ఇతర కరపత్రాలను అందించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ రిసోర్స్ పర్సన్ల నియామకం జరిగిందని, వారి ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. విజయవాడ ప్రధాన కేంద్రంగా తమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు.



## మామిడి ఉత్పత్తులతో ఉపాధి పై శిక్షణ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మామిడి తో విలువ ఆధారిత ఉత్పత్తులపై గ్రామీణ మహిళలకు అవగాహన అవసరమని డాక్టర్ సుధారాణి అన్నారు. పంచాయతీ పరిధిలోని బందలాయి చెరువులో మంగళవారం ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మహిళలకు మామిడి తో విలువ ఆధారిత ఉత్పత్తుల పై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుధా రాణి మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో తయారు చేసే విలువ ఆధారిత ఉత్పత్తులు నేర్చుకొని, మహిళలు స్వయం ఉపాధి పొందాలని కోరారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి. కృష్ణవేణీ మాట్లాడుతూ మామిడి ఉపయోగాలు, లభించే పోష కాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు గురించి వివరించారు. మహిళలకు మామి డి పన్నా, మామిడి చాక్లెట్స్, మామిడి తాండ్ర,మామిడి పొదరు, మామిడి శాండీ, మామిడి జాము,మామిడి జ్యూసులు వంటి పదార్థాల ఉత్పత్తుల గురించి సూక్ష్మంగా తయారు చేసే విధానం చూపించారు. మామిడి ఉత్పత్తులకు బయట మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నదని వీటిపై మహిళలు ఆసక్తి చూపి ఆర్థిక సౌలంబన సాధించుకోవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్తలు డా.రేవతి డాక్టర్ యశ్వంత్, గ్రామ మహిళలూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆకాశవాణి ధ్వని ముద్రణ కోసం ముందస్తు ఉగాది కవుల సమ్మేళనం





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** శ్రీ విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాలలో దివిసీమ కవులతో విజయవాడ ఆకాశవాణి వారి సౌజన్యంతో ముందస్తుగా నిర్వహించిన ధ్వని ముద్రణ ఉగాది కవి సమ్మేళనం వీక్షకులను, కవితాభిమానులను ఉర్రూతలూగించింది. దివిసీమ సాహితీ సమితి, తెలుగు సావిడి, భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి డా.గుడిసేవ విష్ణుప్రసాద్ అధ్యక్షత వహించి కవితా గానం చేశారు. ఆకాశ వాణి సంచాలకులు బి.వెంకటేశ్వర్లు, ప్రయోక్త చుండూరు మాణిక్యాలరావు పర్యవేక్షించారు.ఈ కవుల సమ్మేళనంలో ప్రముఖ కవులు, అవధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, పూషడపు సుబ్బారావు,బి.శ్రీ సుహితా భారతి, డా. డి.ఉమారాణి, జి.సూర్యనారాయణ, జల్లూరి రమాకుమారి, నాయుడు బసవ కామేశ్వరి,సింహాద్రి పద్మ, వంగర శేషగిరిరావు, చన్నగిరి లతామోహన్, నడకుదిటి రాధాకృష్ణ మూర్తి, దీవి ఝాన్సీ, సూరగం రామకృష్ణలు తమ ఉగాది కవితలను రాగ యుక్తంగా, భావ భరితంగా చదివి కవితాభిమానులను పరవశింప చేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ విద్యాసంస్థలు అధినేత కొండవేటి ఈశ్వరరావు తో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ఈనెల 30న ఉగాది రోజున విజయవాడ ఆకాశ వాణి కేంద్రం నుంచి ప్రసారం కానుంది.



## కొత్తపేటలో పొలం పిలుస్తుంది

**కంచికచర్ల మార్చి 18 మేజర్ న్యూస్ :** కొత్తపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులకు సబ్సిడీ లో అందుబాటులో ఉన్న కిసాన్ డ్రోన్లు, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు గురించి వివరించారు.వ్యవసాయ శాఖ అధికారులు, రైతుల తో కలిసి కంది పొలం సందర్శించారు. శనగల కొనుగోలు కేంద్రం (మద్దతు ధర క్వింటాల్ రూ.5650లు) కంచికచర్ల లో మంగళవారం నుండి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే కొత్తపేట రైతులు మార్క్ ఫెడ్ జిల్లా అధికారిని కందుల కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ కే. నాగమల్లిక, మండల వ్యవసాయ ఆధికరి కె. విజయ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

## నేడు ప్రతిష్టాత్మక అశోక్ లేలాండ్ సంస్థ ప్రారంభోత్సవం

**గన్నవరం, మార్చి 18, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా, గన్నవరం నియోజకవర్గంలో పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు, యార్లగడ్డ వెంకట్రావు నిరంతర కృషి ఫలితంలో భాగంగా బాపులపాడు మండలంలోని మల్లవల్లి గ్రామంలో పారిశ్రామిక కారిడార్లో నూతనంగా నిర్మించిన ప్రతిష్టాత్మక అశోక్ లేలాండ్ సంస్థను ఈ రోజు సాయంత్రం 3:30 గంటలకి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, మానవవరుల అభివృది శాఖల మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ చేతులు మీదుగా ప్రారంభించడానికి విచేయుచున్న నేపథ్యంలో నియోజకవర్గ, మండల, గ్రామాల, టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసింది గాతెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి కోరుతున్నారు. ముందుగా ఈ రోజు సాయంత్రం 3:00 గంటలకు హనుమాన్ జంక్షన్ కూడలిలోని శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ ఆలయంలోని స్వామి వారిని నారా లోకేష్, యార్లగడ్డ వెంకట్రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## సీఎం చంద్రబాబుకు చెక్కు అందించిన కుమార్ రాజా



**పామర్రు మార్చి 18 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 వేలు చెక్కును చంద్రబాబు నాయుడుకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన దుక్కిపాటి భ్రమరాంబ ముఖ్యమంత్రి సహాయనిధికి అందించాలని కోరుతూ 50 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే కుమార్ రాజాకు అందించారు. ఈ చెక్కు ఎంఎల్ఏ కుమార్ రాజా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా అందజేసారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు దాత భ్రమరాంబను చెక్కు అందించిన కుమార్ రాజాను అభినందించారు.

## మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి



**జగ్గయ్యపేట మార్చి 18 మేజర్ న్యూస్ :** మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ మున్సిపల్ కార్మికుల సమావేశం పాత మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఎన్సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసింది. కాంట్రాక్టు వ్యవస్థని రద్దు చేసింది మరలా ఈ ప్రభుత్వం కాంట్రాక్టర్ల చేతిలో పెడితే దోపిడీకి తెరలేపడమే అన్నారు. గతంలో కార్మికులకు కాంట్రాక్టర్లు వేతనాలు సక్రమం గా ఇవ్వకుండా పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు సక్రమంగా కట్టని పరిస్థితి ఉండేదన్నారు. పని నుండి కార్మికులను తొలగించేవారన్నారు. ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్ కార్మికులకు నైపుణ్యాన్ని బట్టి వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు పారా యలకమ్మ, సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, నాయకులు ఎస్.ప్రణయ్, మున్సిపల్ కార్మికులు బుజ్జి, సమాధానం తదితరులు పాల్గొన్నారు.

## అడపా బాబ్జీ అడుగు జాడలల్లో పయానించాలి



**గుడివాడ, మేజర్ న్యూస్ :** మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జి తృతీయ వర్ధంతిని బాబ్జీ సేన కన్వీనర్ అద్దేపల్లి పురుషోత్తం అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏజికె సెంటర్లోని అడపా బాబ్జీ విగ్రహాం వద్ద వైసిపి నాయకులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, వెంపటి సైమన్లతో కలసి అద్దేపల్లి పురుషోత్తం మాట్లాడుతూ ప్రజా నాయకులకు మరణం ఉండదని, వారు చేసిన మంచి పనుల ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అడపా బాబ్జి అభిమానులు డివిఎస్ శ్యామ్కుమార్, మాచీరాజు, పందిళ్ళ మల్లి, యార్లగడ్డ మురళి, అడపా పండు, నల్లమోతు జగదీష్, అడపా నాగరాజు, పుచ్చకాయల సురేష్, యడ్లపల్లి బుజ్జులు, పంచకర్ల వెంకట్, కోర్డిపాటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు దరఖాస్తులు ఆహ్వానం

**మొవ్వ మార్చి 17 మేజర్ న్యూస్:** బడుగు బలహీన వర్గాల సంక్షేమంతో పాటు ఆయా వర్గాలు ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించేందుకు ఏపీఓబి ఎంఎస్ఓ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జే. విమాదేవి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఏపీఓబి ఎంఎంఎస్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ఇందులో 50% సబ్సిడీ 50 శాతం బ్యాంకు లోను గా అందించనున్నట్లు తెలిపారు.

### హైవే రోడ్డు పనులతో..

## పలువార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ పురపాలక సంఘ పరిధిలో 19వ తేదీన నేషనల్ హైవే డిపార్ట్మెంట్ వారు శాంతినగర్, నక్కల కాలువ, గుడ్మెన్పేట, ఆర్.టి.సి. కాలనీ వాటర్ ట్యాంకులకు మంచినీటిని సరఫరా చేయు పంపింగ్ మెయిన్ ఇంటర్కనెక్షన్ పనులు చేపట్టుచున్నందున 20వ తేదీన అనగా గురువారం 3వ వార్డు నుండి 18వ వార్డు వరకు, 20వ వార్డులలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడును. కావున ఆయా ప్రాంతముల ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని మున్సిపల్ ఒక ప్రకటనలో కోరారు.

## గన్నవరంలో కారు ఢీకొని వ్యక్తి మృతి.



**గన్నవరం, మార్చి 18, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం చిన్న ఆవుటపల్లి జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గన్నవరం మండలం వీరపనేని గూడెం గ్రామానికి చెందిన అవుతు శ్రీనివాసరెడ్డి (55) ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. కారు బలంగా ఢీకొట్టడంతో లారీ ముందు పడి మృతి చెందిన శ్రీనివాసరెడ్డి. మృత దేహాన్ని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళను కలసిన ఎన్నారై బొబ్బా గోవర్ధన్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావును అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేత, ఎన్నారై పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిసి అవనిగడ్డ నియోజకవర్గ సమస్యలు వివరించారు. మంగళవారం విజయవాడ చైర్మన్ కార్యక్రమంలో నారాయణరావును కలసి రాత్రి సమయాల్లో అవనిగడ్డ నుంచి నాగాయలంక, కోడూరు మండలాలకు వెళ్ళే ప్రయాణీకులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి 10 గంటల తరువాత ఈ రెండు ప్రాంతాలకు బస్సులు లేకపోవడమే దీనికి కారణమని గోవర్ధన్ తెలిపారు.. రాత్రి 10.30 లేక 11 గంటల సమయంలో విజయవాడ నుంచి వచ్చే బస్సులను నాగాయలంక రూట్ కు ఒకటి కోడూరు రూట్ కు ఒకటి పొడిగించాలని గోవర్ధన్ కోరారు. అధికారులతో చర్చించి ప్రయాణీకులకు సౌకర్యంగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటానని చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు హామీ ఇచ్చారని గోవర్ధన్ తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2025 దైనందిన దర్శిని ఆవిష్కరణ




**అమరావతి మార్చి 18 మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2025 దైనందిన దర్శిని ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర సెక్రటేరియట్ లో పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళా వెంకట్రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు. పై కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు విద్యుత్ రంగంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల్ని మంత్రి దృష్టి కి తీసుకొని వచ్చారు. వీటిలో ముఖ్య మైనవి 1)చాలా రోజులుగా కార్మికులు ఈపీఎఫ్ టు జీపీఎఫ్ ప్రధానమైనది మంత్రి దృష్టి కి తీసుకొని రాగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టి కి తీసుకొని వెళ్తాము అని మాట ఇచ్చారు. 2) 2022 లో చేసిన పే ఫిక్షేషన్ లో జరిగిన బేసిక్ పే సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 3) సీలింగ్ లేని వైద్యం ఉద్యోగులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సంఘం సెక్రటరీ ఫైనాన్స్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న డి. ఎ. ఏరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు, 2) అన్ని కంపెనీలకు ఒకే యూనిఫాం ట్రాన్స్ఫర్ పాలసీ అన్ని కేడర్సు కి ఒకేలా వుండాలని కోరారు. సంఘం రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ మాట్లాడుతూ కాలంతో పాటు విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మికులు, ఉద్యోగులు మారి సంస్థకు సహకరించాలని కోరారు. పై కార్యక్రమంలో కేసిన శంకర్రావు ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ యస్ పి డి సి యల్ కార్యదర్శి వై వి సునీల్, సంఘం అసోసియేట్ అధ్యక్షుడు జి రాము, సి పి డి సి యల్ నుండి కె ఉమా మహేశ్వర రావు,యన్ వీరాంజనేయులు, విజయనగరం నుండి జిల్లా అధ్యక్షుడు ఆర్ అప్పలనాయుడు, ఆర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# వర్గీకరణకు క్యాబినెట్, అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎంకి ఎమ్మార్పీఎస్ కృతజ్ఞతలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** 30 సంవత్సరాల మాదిగల ఆశను, ఆకాంక్షను నెరవేర్చే ప్రయత్నంలో భాగంగా, సైద్ధాంతిక పునాదుల మీద శాస్త్రీయ బద్ధంగా ఎస్సీల సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి రంగాల స్థితిగతులపై అధ్యాయనం చేసి ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజిస్తూ 1 శాతం రెల్లికి, 6.5 శాతం మాదిగలకు, మాదిగ ఉపకులాలకు, 7.5 శాతం మాలలకు, మాల ఉప కులాలకు రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ అందించాలని రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికకు క్యాబినెట్ సభ్యులతో చర్చించి, అసెంబ్లీలో రాజీవ్ రంజన్ మిశ్రా నివేదిక కు ఆమోదం తెలిపి రాష్ట్ర యూనిట్ గా ఎస్సీల వర్గీకరణ అమలు చేస్తాము అని ఆమోదం తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం పక్షాన యావత్తు, మాదిగ జాతి పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాష్ట్ర కో కన్వీనర్లు మానికొండ శ్రీధర్ మాదిగ అన్నారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. 1994లో ఎంఆర్పిఎస్ ఉద్యమం ఏర్పడితే 1996 లోనే రామచంద్రరావు కమిషన్ సిఫార్సుల మేరకు జనాభా దామాషా ప్రకారం ఆనాడు వర్గీకరణ చేసినా, నేడు విభజిత ఆంధ్రప్రదేశ్ లో ఆగస్టు 12024న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీల వర్గీకరణ ను రాష్ట్రాలే అమలు చేసుకోవచ్చు అని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ లో రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ వేసి నేడు వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ, త్వరలోనే అసెంబ్లీ లో చట్టబద్ధత కల్పించి ముందుకు వెళ్తూ నాడు అయిన నేడు అయిన వర్గీకరణ చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని, వర్గీకరణ విషయంలో భవిష్యత్తులో కూడా ఏలాంటి న్యాయపరమైన, సాంకేతిక పరమైన సమస్యలు రాకుండా రాష్ట్ర యూనిట్ గానే ముందుకు సాగాలని కోరుకుంటూ వర్గీకరణ పోరులో అసువులు బాసిన అమరవీరులకు ఈ విజయాన్ని అంకితం ఇస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పక్షాన, ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడిన గడ్డ ఈదుమూడి పక్షాన, యావత్తు మాదిగ జాతి పక్షాన మరొక్కసారి నారా చంద్రబాబు నాయుడుకి, రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ కు, వర్గీకరణకు ఆమోదం తెలిపిన క్యాబినెట్ కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. అలాగే భవిష్యత్తు కార్యచరణను చర్చించుటకు అత్యవసరంగా ఈ నెల 21వ తారీఖున ఎమ్మార్పీఎస్ ఉద్యమ పురిటిగడ్డ మాదిగల పోరాట క్షేత్రం ఈదుమూడి లో అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించుకోదలిచామని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పానుగంటి పాలెం రాజు మాదిగ, ఏటుకూరి విజయకుమార్ మాదిగ, గుండాల ఆనంద్ మాదిగ, కొమరోల శ్రీనివాస్ మాదిగ, లంకా బుజ్జమ్మ మాదిగ, చంద్ర లీల మాదిగ, జయరాజ్ మాదిగ, మనోజ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు,ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు విరివిగా, రుణాలు అందించాలి




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రైతులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందించి వారి పురోభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బ్యాంకర్లను ఆదేశించారు మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల సమితి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట సాగు చేస్తూ సిసిఆర్సి కార్డులు కలిగిన కౌలు రైతులకు వారి పంట మీద తప్పనిసరిగా రుణాలు అందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సాహంగా ప్రత్యేకించి బ్యాంకు రుణాలు అందించాలన్నారు. అవసరమైతే రుణ పరిమితి పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు ఎం ఎస్ ఎం ఈ కింద ఏపీఐఐసీ ద్వారా స్థలం కేటాయింపు పొందిన పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా క్రెడిట్ గ్యారెంటీ ట్రస్ట్ ఫండ్ నిబంధనల ప్రకారం ఎటువంటి కొల్లేటరల్ సెక్యూరిటీ లేకుండా రుణాలు అందించాలన్నారు. రవాణా రంగానికి సంబంధించి బ్యాంకు రుణాలు తక్కువగా ఇస్తున్నారని ఆ రంగానికి కూడా ప్రాధాన్యతనిచ్చి ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. బ్యాంకు కంట్రోలింగ్ అధికారులు పరిశ్రమల అధికారి తో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు విరివిగా రుణాలు అందించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 7000 మంది మహిళా వ్యాపారవేత్తలను సిద్ధం చేయాల్సి ఉందని, వారికి అవసరమైన జీవనోపాదులు కల్పించి ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకోసం బ్యాంకులు స్వయం సహాయక సంఘాల మహిళలకు విరివిగా రుణాలు అందించి ప్రోత్సహించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లక్ష రూపాయల వరకు బ్యాంకు రుణాలను ఎటువంటి బిల్లులు లేకుండా మంజూరుచేసి చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన కింద అత్యధిక ప్రాధాన్యత నిచ్చి పెండింగ్లో ఉన్న దరఖాస్తులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద దరఖాసుదారులకు బ్యాంకు రుణాలు అందించాలన్నారు. సైబర్ నేరాల నేపథ్యంలో బ్యాంకు ఖాతాదారులకు భరోసా ఇచ్చే విధంగా డిజిటల్ అరెస్టు నివారించేందుకు వినియోగదారులు ఏదేని లావాదేవీలు జరిపినప్పుడు ఆ లావాదేవీలు సరైనవా కావా విచారించేందుకు వీలుగా ఖాతాదారుల కోరిక మేరకు 24 గంటల పాటు హోల్డ్ లో ఉంచే విధంగా ఒక ఫీచర్ను తయారు చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఏజీఎం అభిషేక్, ఎల్ డి ఎం సి. రవీంద్రారెడ్డి, ఇండియన్ బ్యాంక్ డిఎం రామారావు, ఎస్బిఐ ఆర్ఎం సుబ్రహ్మణ్యం, యూనియన్ బ్యాంకు ఆర్ఎం తాతాజీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం వెంకటరావు, డి ఆర్ డి ఎ పి డి హరిహరనాథ్, జెడ్పిసిఈఓ కన్నమనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్,జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నర్సింహులు, టిడ్కో పిడి చిన్నోడు తదితర అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



# నాటుసారా రహిత జిల్లా లక్ష్యంగా కొత్త నవోదయం





(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం తిరువూరులో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన నవోదయం 2.0 కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. అధికారులతో కలిసి ప్రత్యేక ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా తిరువూరు డివిజన్‌లో అక్కడక్కడా కొన్ని గ్రామాల్లో నాటుసారా ఆనవాళ్లు కనిపిస్తున్నాయని.. ఈ నేపథ్యంలో సారా తాగితే అధోగతి.. మానితే పురోగతి నినాదంతో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నామన్నారు. మొదటి దశ నవోదయం మంచి ఫలితాలు ఇచ్చిందని.. ఇదే స్ఫూర్తితో పూర్తి నిర్మూలన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0ను ప్రారంభించినట్లు వివరించారు. గుర్తించిన ప్రతి గ్రామంలోనూ, మండలంలోనూ ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని.. అదేవిధంగా జిల్లాస్థాయి కమిటీ కూడా సేవలందిస్తుందన్నారు. కమిటీల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నాటుసారాను ఓ వ్యాపారంగా మార్చుకున్న వారిపై చట్టపర చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. జీవనోపాధి కోసం నాటుసారా కాస్తున్న వారిని గుర్తించి.. వారికి అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు దిశగా నడిపించడం జరుగుతుందని.. వివిధ పథకాల ద్వారా చేయూతనందించనున్నట్లు తెలిపారు. నిరంతర పర్యవేక్షణతో వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. తిరువూరు డివిజన్‌లో అయిదు గ్రూప్–ఎ గ్రామాలు (నాటుసారా కాయడం, అమ్మడం) ఉన్నాయని, అదేవిధంగా 9 గ్రూప్–బి గ్రామాలు (నాటుసారా తయారీ) ఉన్నాయన్నారు. జిల్లాలో ఎ.కొండూరు, విసన్నపేట, గంపలగూడెం, రెడ్డిగూడెం మండలాల పరిధిలో 26 గ్రామాలను గుర్తించి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లాలో ఎక్కడా నాటుసారాను తయారు చేయడం లేదా విక్రయించే కార్యకలాపాలు లేకుండా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ ఇలా వివిధ శాఖల సమన్వయంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. నాటుసారా తాగడం వల్ల శాశ్వత అంధత్వంతో పాటు వివిధ అనారోగ్యాల బారినపడటం జరుగుతుందని.. కిడ్నీ వ్యాధులకు ఈ నాటుసారా కూడా ఒక కారణమని ఈ నేపథ్యంలో ఎక్కడా నాటుసారా ఆనవాళ్లు కనపడకుండా అందరూ సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాజాత ప్రదర్శనలతో పాటు ప్రత్యేక పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, వివిధ మండల కమిటీల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో అంబేద్కర్ ఆశయాలు నెరవేరాయి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఎస్సీ ల వర్గీకరణతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది కూటమి నేతలు అన్నారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ఎస్సీ ముఖ్య నాయకులు హర్ష వ్యక్తం చేశారు ఈ సందర్భంగా కొల్లూరి వెంకటేశ్వరరావు, మంచాల మహేంద్ర మాట్లాడుతూ విభజనతోనే సామాజిక న్యాయం, అంబేద్కర్ కల సహకారం అయినది. ఎవరికి నష్టం లేకుండా అట్టడుగువర్గాలయు పైకి తేవాలని లక్ష్యం తెలుగుదేశం పార్టీ దళితులపై వివక్షను తొలగించేందుకు ఆనాడు తెలుగుదేశం పార్టీయే. రెండు గ్లాసుల విధానానికి ముగింపు పలికింది టిడిపి ప్రభుత్వం జిఎంసి బాలయోగిని మొదటి దళిత స్పీకర్, ప్రతిభా భారతి ని శాసనసభ స్పీకర్గా నియమించిన తెలుగుదేశం పార్టీయే గతంలో ఐదు సంవత్సరాలు ఏబిసిడిలుగా విభజిస్తూ తెలుగుదేశం పార్టీ ఉత్తర ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి రాష్ట్రపతి కే ఆర్ నారాయణ ఆమోదంతో అమలులోకి 2000 సంవత్సరం నుండి 2004 వరకు ఏబిసిడి విభజన అమలులో దాదాపు 24,500 ఉద్యోగ అవకాశాలు మాదిగ, ఉపకులాలకు అందాయి..2008లో ఉషా బెహరా కమిషన్ నివేదిక ఎస్సీల రిజర్వేషన్లు సముచిత ప్రాతినిధ్యం లేదనీ నివేదిక ఇచ్చిందన్నారు 2012 లో విభజనకు అనుకూలముగా తెలుగుదేశం పార్టీ ఆనాడు ప్రధానికి లేఖ రాశారని2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు విభజనకు అనుకూల తీర్పు ఇచ్చారని 2024 నవంబర్ 15 న ఏకసభ్య కమిషన్ (రాజీవ్ రంజన్ మిశ్రా) విభజన అంశంపై నివేదిక ఇచ్చారన్నారు 2025 మార్చి 10 న కమిషన్ నివేదిక... ఎస్సీలలో 59 ఉప- కులాల విభజనకు సిఫారసు చేశారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ.. ఎవరికి నష్టం జరగకుండా... అట్టడుగు వర్గాలకు కూడా, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుంది.. భారత్ పార్లమెంటులో చట్ట సవరణ ద్వారా శాశ్వతంగా అమలు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాచవరపు ఆదినారాయణ, పుల్లగోరు రాజేంద్ర రావు, దిరిశం వెంకట్రావు, దిడ్ల జానకి రాంబాబు, కంచర్ల ఆనంద్, కొల్లూరు ఇమ్మానియేల్,తండు గంగాధర్, కొల్లూరి వాసు. తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ సారధ్యంలో గ్రామాలు అభివృద్దే లక్ష్యం



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని మండల టిడిపి అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలో మారేపల్లి గ్రామంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్(చిన్ని) తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికిపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ఎంపీ కేశినేని చిన్ని గ్రామస్తులను చైతన్యపరిచి వాళ్లకు మంచి ఉపాధి కల్పించే లక్ష్యంగా గొప్ప ఆలోచనతో అన్ని కులాల వారికి మహిళలు, పురుషులకు సబ్సిడీ రూపంలో మంచి యూనిట్ లు ద్వారా ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత ను తయారు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కోరిన విధంగా మన ఎన్టీఆర్ జిల్లాను స్వయం ఉపాధి రంగంలో దేశంలోనే ఆర్థికంగా ముందుండాలని కోరిన ఎంపీ సారాధ్యంలో మారేపల్లి గ్రామ వాసులకు యూనిట్ లోన్లు ద్వారా లబ్ది ఎలా చేకూర్చుకోవాలో వివరించే భాగంలో కొన్ని ముఖ్యమైన వ్యాపారరంగాలు అనగా,మామిడి తాండ్ర, నాటు కోళ్లు వ్యాపారం, పుట్టగొడుగుల పెంపకం, కాలుష్యం లేని ఇటుక తయారీ, పచ్చళ్ళు,, కారం, పసుపు, పౌడర్, సాసులు తయారు చెయ్యడం, ధాన్యాలనుండి పిండిని తయారు చేసే యంత్రాలు, బ్యూటీ పార్లర్, విస్తరాకులు ప్లేట్లు, గ్లాసులు మిషన్, ప్లాస్టిక్ నివారించి నాచురల్ గా మన ఇంటిలో ఉండే వేస్ట్ క్లాత్ ల ద్వారా పేపర్ బ్యాగులు తయారీ, గేదలు, ఆవులు, మేకలు, గొర్రెలు, వర్మి కంపోస్ట్ ఎరువు తయారు చేయడం, తేనె పట్టు పరిశ్రమ, సోలార్ ద్వారా డిహైడ్రేషన్ ఫుడ్ తయారు చేయడం ద్వారా గ్రామ ప్రజలకు స్వయం ఉపాధి గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ ఛాంపియన్స్ కోఆర్డినేటర్ సొంగ సంజయ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, పోలిశెట్టిపాడు ప్రసాద్ రెడ్డి, మారేపల్లి సర్పంచ్ నాగేశ్వరరావు, పంచాయితీ ఛాంపియన్స్ చేకు రమేష్, ప్రొద్దుటూరి కృష్ణ, జువ్వ తరుణ్,, కీలావత్ వసుంధరావు, షేక్ తాజాహుద్దీన్, శ్రీరామ్, బి కొండయ్య, బి వెంకటకృష్ణ,, ఆశా వర్కర్స్, బుక్ కీపర్స్, డ్వాక్రా మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరుణాల్లో అపశృతి

**పెనుగంచిప్రోలు మార్చి 18 మేజర్ న్యూస్ :** పవిత్ర పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో చిన్న తిరునాళ్లు సందర్భంగా ఏర్పాటుచేసిన జెయింట్వెల్ ఊడిపడి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల్లో ఒక వ్యక్తి మృతి మరొకరికి గాయాలు కావడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన వారు వేమవరం గ్రామానికి చెందినవారుగా గుర్తింపు. అత్యంత వైభవంగా జరిగిన చిన్న తిరుణాలలో కొన్ని అనుకోని అసాంఘిక సంఘటనలు జరగటంతో పలువురు భక్తులు పలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.

## అగ్ని ప్రమాద నిరోధక అవగాహన



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి మంగళవారం ఉదయం శేష సాయి కల్యాణమండపం, ఎంజి. రోడ్,శ్రీనివాస గ్రావిటీ కాలేజ్, మొఘలరాజపురం, తనూజ ఇమేజ్, డైగ్నోస్టిక్ సెంటర్ బిల్డింగ్, థియేటర్ కాంప్లెక్స్ లను ఆకస్మిక తనిఖీ చేసారు వీఎంసి ఫైర్ సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వారి అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం 5వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 42 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులను ఆరవ అడిషనల్ జ్యూడిషల్ మెట్రో పాలిటన్ కోర్ట్ లో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 42 మందిలో 15 మందికి ఒక్కొక్కరికి రూ.15,000ల చొప్పున మిగిలిన 27 మందికి, ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలియజేయటం జరిగింది.

## ప్రతి మహిళా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** సమాజంలో ప్రతి మహిళ చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని ప్రొడక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్ (పోనిక్) ప్రతినిధి జాన్సన్ అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక సింగ్ నగర్ లోని 59 వ డివిజన్ కమ్యూనిటీ హాలులో మంగళవారం మహిళలు, బాలల చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య ముఖ్య అతిథిగా హాజరైన పోనిక్ ప్రతినిధులు జాన్సన్, శారదలు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు వృద్ధులకు ప్రత్యేకంగా చట్టాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ఒకసారి చట్టం ద్వారా బాలికలు చిన్నారులు మహిళలపై ఎటువంటి అఘాయిత్యాలకు ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించేందుకు ఫోక్సో చట్టం ఉందన్నారు. బాల్య వివాహాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, చట్టాలపై ప్రతి మహిళ పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ ట్రాఫికింగ్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ సి డాక్టర్ సూజన్, ఐసిడిఎస్ ఎసిడిపివో వి. విజయ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల భద్రతే మన ప్రధాన ధ్యేయం



## మీ యొక్క మొబైల్ ఫోన్లో శక్తి ఆప్‌ను డౌన్లోడ్ చేసుకోండి

## పోలీసు వారి తక్షణ సహాయాన్ని పొందండి

## నూతన శక్తి టీంలను ప్రారంభించిన ఎస్పీ గంగాధరరావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చిన నేపథ్యంలో,రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్త, ఉత్తర్వుల మేరకు, మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు, మహిళల భద్రతకు భరోసాగా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 40 మంది సిబ్బందితో 20 శక్తి టీం బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ టీంలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో అదనంగా 12 టీంలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇలా నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్ లను జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, జెండా ఊపి ప్రాంభించి, శక్తి టీం సిబ్బందికి వారు చేయవలసిన విధులు, పాటించవలసిన నియమ నిబంధనలు గూర్చి దిశా నిర్దేశం చేశారు. శక్తి టీం సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ, మహిళా వివక్ష, హింస, లైంగిక వేధింపులకు సమాజంలో స్థానం లేదు. మహిళల రక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యతనిస్తుంది, దానికి అనుగుణంగా అనేక కార్యక్రమాలను చేపట్టడంతో పాటు క్షేత్ర స్థాయిలో అమలు చేయడం జరుగుతుంది. అందులో భాగంగా ఈ రోజు ఒక ఎస్సై నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, ముగ్గురు పురుష కానిస్టేబుళ్లతో మొత్తం ఆరుగురు సభ్యులతో కూడిన 12 శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శక్తి టీం బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తూ, సామాన్య ప్రజలలో కలిసిపోయి పరిస్తుతులను గమనిస్తూ అవసరం మేరకు పని చేస్తాయి.

మహిళలపై వేధింపులు, హింస,ఈవ్ టీజింగ్, ఇతర నేరాలను అరికట్టేందుకు, మహిళల భద్రతను మరింత మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ బృందాలను ఏర్పాటు చేశాము.మీరంతా నిరంతరం కళాశాలలు, బస్టాండ్, షాపింగ్ మాల్స్, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాలలో పహార కాస్తూ, మహిళలపై జరిగే వేధింపులను అరికట్టడంలో కీలకంగా వ్యవహరించాలి. వారికి తోడుగా మేమున్నామనే నమ్మకం కలిగించాలి. మహిళలు చిన్నారులు ఎవరైనా సరే సమస్యల్లో ఉన్నాము, అత్యవసర పరిస్థితుల్లో చిక్కుకున్నాము, అని శక్తి యాప్ ద్వారా మీ సహాయం కోసం అర్జిస్తే తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొని వారికి భరోసాగా నిలవాలి. మహిళ రక్షణ చట్టాల ను గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తక్షణ సహాయం పొందడం కోసం వారి కోసం ప్రత్యేకంగా ఉన్న హెల్ప్ లైన్ నెంబర్ల యిన 1098, 1930, 112, 181 ల గురించి వారికి తెలియజేస్తూ ఫిర్యాదు ఏవిధంగా చేయాలి? ఫిర్యాదు స్వీకరించి ఏ విధంగా న్యాయం చేస్తారు అనేది పూర్తి వివరణ అందించాలి.

రాష్ట్రంలోని మహిళల చిన్నారుల భద్రత రక్షణ కోసం పోలీస్ శాఖ రూపొందించిన ఈ శక్తి ఆప్ మీ సెల్ఫోన్లో ఉంటే ఎల్లప్పుడు ధైర్యంగా ఉండవచ్చని భరోసా విద్యార్థులలో పెంపొందిం చండి. ప్రతి ఒకరి మొబైల్లో శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించండి. శక్తి యాప్‌లోని ప్రత్యేకతను గురించి తెలియ జేస్తూ.మహిళలు ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌లోని యస్ ఓ యస్ (సేవ్ అవర్ సోల్స్) ఆప్షన్ నొక్కితే వారి లొకేషన్, వీడియో, ఆడియో కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. పోలీస్ స్టేషన్కు వెళ్లకుండానే ఫిర్యాదు చేసే వీలుంది. అంతేకాకుండా ఫోన్ ఊపినా కూడా సమాచారాన్ని పోలీసులకు చేరుతుంది. ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు "సేఫ్ ట్రావెల్" ఆప్షన్ ద్వారా వాహన నెంబర్ ప్రయాణ మార్గాన్ని



షేర్ చేయవచ్చు. పోలీస్ కంట్రోల్ రూమ్ వాహ నాన్ని ట్రాక్ చేస్తుంది మార్గం తప్పితే వెంటనే స్పందిస్తుంది. లైంగిక వేధిం పులు, కలహాలు, గృహహింస, సైబర్ క్రైమ్స్, ఫోటో మార్ఫింగ్, పరువు హత్యలు, ఇతర ఏ నేరాల గురించి గివ్ ఏ కంప్లైంట్ ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. భర్త వేదింపులు, గృహహింస, కుటుంబ కలహాలు, వంటి సమస్యలకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ సేవలు పొందే వీలుంటుంది. అదృశ్యమైన పిల్లల సమాచారం అందజేసి పోలీసుల సహాయం తక్షణమే పొందవచ్చు. అప్రమత్తత కోసం కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల యొక్క ఐదు ఫోన్ నెంబర్లు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఆపద సమయంలో యస్ ఓ యస్ నొక్కిన వెంటనే వారికి సమాచారం చేరవేయబడుతుంది. కేవలం మహిళల వేధింపుల పైనే కాకుండా బహిరంగ మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగం, చీకటి ప్రదేశాలలో అసాంఘిక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై కూడా ఫిర్యాదు చేయవచ్చు. అత్యవసర సమయంలో నైట్ షెల్టర్స్ అయినా వన్ స్టాప్ సెంటర్లలో ఆవాసం పొందవచ్చు. ఇది మహిళా పోలీస్ స్టేషన్ దగ్గరలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ప్రాంగణం వద్ద కలదని తెలిపారు. ప్రతి ఒక్క సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, మీ పరిధిలో ఉన్న ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని, సమస్యల్లో ఉన్న మహిళలకు మేమున్నామనే ధైర్యాన్ని పెంపొందించాలని, ఆ సాంఘిక కార్యకలాపాల కట్టడానికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడు, అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ బి సత్యనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రాఘవయ్య, రవి కిరణ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



**కంచికచర్ల మార్చి 18 మేజర్ న్యూస్ :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని మంగళవారం కార్మిక శాఖ మంత్రి కి కంచికచర్ల ఐఎఫ్టియు, ఈ సి డబ్ల్యూ యు నాయకులు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలుపుదల చేసేందుకు ప్రవేశపెట్టిన సర్క్యులర్ 1214ను తక్షణమే రద్దు చేసి కార్మికులకు పథకాలను అమలు చేయాలని కోరుతూ సెక్రటేరియట్ లోని మంత్రి సుభాష్ చాంబర్లో కలిసి వివరించారు. వినతి పత్రం అందుకున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి స్పందిస్తూ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తెరిచేందుకు కృషి చేస్తున్నామని త్వరలోనే సంక్షేమ బోర్డును అమలు చేసి సంక్షేమ పథకాలు కుడా అమలు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకొని 36 రకాల వృత్తులలో 35 లక్షల మంది కార్మికులు అ కార్మికుల పై ఆధారపడిన 35లక్షల కుటుంబాలు ఈరంగం పై ఆధారపడి జివిస్తున్నారు.గడిచిన 6 సంవత్సరాలుగా పని చేస్తూ ప్రమాదాల బారిన పడ్డ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి రావాల్సిన నష్టపరిహాణాలు రాకపోవడంతో ప్రమాదాల గురైన కార్మికులపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడ్డాయి.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఇసుక, సంక్షేమ బోర్డు అమలు చేస్తామని హామీ హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు అట్లాగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకి కోటి రూపాయలు విరాళం ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటమే మరిచారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి,బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి హరికృష్ణ రెడ్డి ఐఎఫ్టియు కార్యదర్శి,బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లో ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించిన వీఎంసీ కమిషనర్



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అన్న క్యాంటీన్లో ఆహార నాణ్యతను స్వయంగా తానే పరిశీలించారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా గులాబీ తోటలో ఉన్న అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూలైన్లో టోకెన్ తీసుకుని, టిఫిన్ లో ఆహార నాణ్యతను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఆహారం తీసుకుంటున్న ప్రజలతో కలిసి టిఫిన్ చేస్తూ, అక్కడున్న వసతులు బాగున్నాయా, టోకెన్లు అందరికీ అందుతున్నాయా, సరైన సమయానికి అన్న క్యాంటీన్ తెలుస్తున్నారా, పరిశుభ్రత ఎలా ఉంది వంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొకవల్, సిబ్బంది పాల్గొన్నారు.






18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999